# జ్ఞానక్షేత్రం



నలుగురు బక్కవాళ్ళు.

బతికి చెడ్డవాళ్ళు.

బతకలేక బడిపంతుళ్ళయినవాళ్ళు.

ఫిరంగిపురంలో రైలుదిగి డొంకలో పరుగుపరుగున నడుస్తున్నారు. చూపులు మబ్బులోకి చొప్పిస్తూ, ఆశలు ఆకాశంలో నిలుపుకుంటూ

వాళ్ళు పంతుళ్ళే! వాళ్ళ అవతారాలే చెప్తున్నాయి. మాసిన కండువాలు పెరిగిన

గడ్డాల వెనక వెలుగుతున్న జ్ఞాననేత్రాలు.

పెళ్ళాలకి నగలు చేయించలేక, కూతుళ్ళకి పెళ్ళిళ్ళు చేయలేక ఉదయాస్తమయాలు పాఠం చెప్పడం తప్ప మరేమీ చేతకానివాళ్ళు వారు. నాలుగక్షరాలు చెప్పుకుని బతికేస్తున్నారు గదా అని నానా మాటలు అంటే పడేందుకు సిద్ధంగా లేరు. వాళ్ళు మానధనులు.

అంతే జరిగింది.

జీతమిస్తున్నానన్న ధీమాయో, ఏమో కరస్పాండెంటు క్లాసురూంలోకి హఠాత్తుగా వచ్చాడు. పంతులు పాఠం చెప్పడం మధ్యలో ఆగిందే అని బాధపడుతూ కుర్చీలోంచి లేవడం కొంచెం ఆలస్యం చేశాడు. కరస్పాండెంటు కళ్ళు నిప్పులయిపోయి "ఆ బవిరి గడ్డవేమిటి?" అని ఎద్దేవా చేశాడు. పంతులు చేతులు ముకుళించి "మా ఆవిడ నీళ్ళోసుకుందండీ" అన్నాడు. కరస్పాండెంటు ఓ వెటకారం నవ్వు విసిరి "ఆ చిరుగుల ఉత్తరీయం ఏవిటి?" అని మళ్ళీ పొడిచాడు.

వానపాములాంటి పంతులు కోడె తాచయినాడు.

"తమరిచ్చే జీతపురాళ్ళకి పట్టుబట్టలు రావండీ?" అన్నాడు.

కరస్పాండెంట్ వెర్రెత్తిపోయి "తమకు పట్టుబట్టలు కావాలేం? ఇంతోసి పండితులకి, ఇంతోసి మేధావులకి మేమిచ్చేది జీతపు రాళ్ళయినాయా ఏం .... " అంటూ అనరానివన్నీ అని గుమ్మం దాటిపోయాడు.

ఇలాంటి సన్మానమే మరో ముగ్గురు పంతుళ్ళకయింది. స్కూలయింతర్వాత నలుగురూ చెట్టుకింద సమావేశమయి బావిలో దూకి చద్దామా లేక కాలవలో దూకుదామా అని సమాలోచనలు జరుపుతుంటే ఒకరన్నారు. "చదువురాని ఈ దేశంలో అక్షరజ్ఞానమిచ్చేవాడు అడుక్కుతినడయ్యా! మనకు చచ్చే కర్మమేమి? మనకు మేడలూ మిద్దెలూ అక్కర లేదు. చదువు చెప్పేవాణ్ణి చెప్పెట్టి కొట్టే చోట మనకి స్థానం లేదు. ఎక్కడకయినా వెళ్లి మన బడి మనమే పెట్టుకుందాం పదండి." అందరూ ఉత్తరీయాలు దులుపుకు లేచారు. ఎవరో కుర్రాడితో వూరెడుతున్నాం అని ఇళ్ళకి కబురు చేశారు. ప్రయాణమయ్యారు.

పరుగుపరుగున అమరావతి చేరుకున్నారు. కృష్ణలో స్నానం చేశారు. దేవుడికి సాగిలపడ్డారు. గుడి నీడలో కూర్చుని గోపుర శిఖరాలమీంచి వూరుని కలియ చూశారు.

ఎంత చల్లటి గడ్డ!
ఏనాటి మట్టి?
బౌద్ధ విశ్వవిద్యాలయం మెట్టిన చోటు!

'ఇక్కడే బడి' అని సంకల్పించి నాలుగు రోడ్ల కూడలికి వచ్చి, నలుగురినీ చేరదీసి ఈ వూళ్ళో స్కూలు స్థాపిస్తామన్నారు. విస్తుపోయారు గ్రామజనులు. మనవూరేమి? ఇంగ్లీషు చదువేమి? ఈ పరగణాలో ఎక్కడా స్కూలు లేదే! ఆ రాత్రికి భోజనం ఏర్పాటు చేశారు పంతుళ్ళకి.

మర్నాడు ఓ ఇంటి వరండాలో స్కూలు స్థిరపరిచారు. ఇంటింటికి తిరిగి బిచ్చమెత్తినట్టు "అయ్యా మీ పిల్లవాణ్ణి స్కూలుకు పంపండి. మేం పాఠాలు చెప్తాం. మేం వృద్ధిలోకి తీసుకొస్తాం" అని ప్రార్థించారు.

పిల్లలు చేరారు!
కొత్త చదువు!
కొత్త పాటలు!

చుట్టు ప్రక్కల పదిహేను మైళ్ళదూరం నుంచి పిల్లలు రావటం మొదలెట్టారు. ఆ పరగణా అంతా జ్ఞాన సంచలనం.!

కొంతకాలం రహస్యంగా స్కూలు నడిపారు పంతుళ్ళు. ఆ పైన బహిరంగంగానే "మాదీ ఈ బడి" అన్నారు.

ఎక్కడ పుట్టారో ఎక్కడ పెరిగారో ఈ గడ్డన చదువుల తల్లిని దింపి వందలమంది కుర్రల్ని వ్యక్తుల్ని చేశారు. ఆ పరగణా అంతా అక్షరకాంతి పంచారు. జ్ఞానజ్యోతి అంతా విస్తరించింది. జ్ఞానక్షేత్రం పుష్కలంగా పండుతోంది. ఆ క్షేత్రం చుట్టూ నాలుగు పక్కలా నలుగురు పంతుళ్ళు ఎదిగి వచ్చిన పంట చూసి నవ్వుతూ కన్నీళ్ళు రాలుస్తున్నారు. వాళ్ళకి పెళ్ళాల నగలూ, కూతుళ్ళ పెళ్ళిళ్ళూ పట్టలేదు.*